**మాటా మంతి లేకుండా పడున్న పెనిమిటిని చూస్తుంటే జానకికి దుఃఖం ఆగడం లేదు. ముప్ఫైఏళ్ళ బట్టి ఎంతో అన్యోన్యంగా సహజీవనం చేసిన భర్త ఏ క్షణాన తనను విడిచి వెళ్ళిపోతాడోనన్న బెదురు ఆమె కళ్ళల్లో కానొస్తోంది. గుండెనొప్పితో బాధపడుతున్న భానుప్రకాష్‌ని హాస్పటల్‌లో చేర్పించి పదిరోజులవుతోంది. చికిత్స చేస్తున్న డాక్టర్లు అతడికి ఆపరేషన్ చెయ్యాలన్నారు. అందుకు ఐదు లక్షలవుతుందట. డబ్బు కడితేతప్ప ఆపరేషను జరగదు. ఇంతవరకు టెస్టులకి, మందులకి లక్ష రూపాయలదాకా ఖర్చయింది.**

# ప్రణవామృతం

## దూరి వెంకటరావు



తండ్రి హాస్పటల్‌లో ఉన్నాడని ఫోన్ చేస్తే బెంగుళూరు నుంచి కొడుకు, కోడలు వచ్చారు.

''నాన్నకెలా ఉందమ్మా'' అడిగాడు శ్రీధర్ వచ్చీరాగానే.

అతడి కంఠంలో కంగారు ధ్వనిస్తోంది.

''డాక్టర్లు ఏమన్నారత్తయ్యా'' అడిగింది మాధవి.

ఆమె గొంతులోను అదే కంగారు.

''చూస్తున్నారు కదా, ఎలా ఉలుకు పలుకు లేకుండా పడున్నారో ఆపరేషను చేస్తే తప్ప బతకడం కష్టమంటున్నారు డాక్టర్లు. అందుకు ఐదు లక్షలు అవుతుందట. నాకేం చెయ్యాలో పాలుపోవడం లేదు'' దుఃఖాన్ని ఆపుకోలేక నోట్లో చీర కొంగు కుక్కుకుంది జానకి.

''నువ్వేం దిగులుపడకమ్మా నాన్నకి ఏం కాదు. డబ్బు నేను పట్టుకొస్తాను'' తల్లికి ధైర్యం నూరి పోసాడు శ్రీధర్.

ఆ మాట చెప్పివెళ్ళిన కొడుకు ఇంతవరకు పికర్లేదు. ఫోన్ చేస్తే ''ఆయన ఆ ప్రయత్నంలోనే ఉన్నారత్తయ్యా'' అంది మాధవి.

జానకి మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు మరెన్నో అనుమనాలు.

ఉన్న పళంగా ఐదు లక్షలు తేవాలంటే మాటలా?... బ్యాంకులో అంత సొమ్ము రడీగా ఉండొద్దూ!.... డబ్బు కోసం వెర్రినాగన్న ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో? ఎన్ని అవస్థలు పడుతున్నాడో?... అందుకు కోడలు సహకరిస్తే పరవాలేదు లేకపోతే? ఇటువంటి పరిస్థితే తన అత్తయ్య మహాలక్ష్మమ్మకు ఎదురైనప్పుడు తను పోషించిన పాత్ర గుర్తుకొచ్చింది. గుండె దడదడ లాడింది. భయంతో గజగజ వణికిపోయింది. అనుకోకుండా ఆమె ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

***

సీతారామయ్య, మహలక్ష్మమ్మ దంపతుల నోముల పంట భానుప్రకాష్. తను చేసేది బట్టల కొట్లో సేల్స్‌మెన్ అయినా కొడుకు భవిష్యత్తు మాత్రం ఉజ్వలంగా ఉండాలనుకున్నాడు. అందుకే వాడిని ఇంగ్లీషు మీడియం స్కూల్లో వేసాడు. కడుపు కట్టుకుని వాడికి ఫీజులు కట్టాడు. పుస్తకాలు కొన్నాడు.

భానుప్రకాష్ ఇంటర్‌లో ఫస్టు క్లాసొచ్చింది. ఉన్నత చదువు చెప్పించే స్తోమత తనకు లేదని తెలిసినా వాడిని డిగ్రీ కాలేజీలో చేర్పించాడు. బిడ్డ చదువుకోసం దొరికిన చోట్లల్లా అప్పులు చేసాడు. బి.ఇడి. అవుతూనే వాడికి టీచరుగా ఉద్యోగమైంది.

సీతారామయ్య దంపతుల ఆనందానికి అవధుల్లేవు. పాయసం వండుకుని పండగ చేసుకున్నారా రోజు.

మొదటి నెల జీతం అందగానే డబ్బు పట్టుకొచ్చి తండ్రి చేతిలో పెట్టాడు భానుప్రకాష్.

''జీవితమంతా నాకిచ్చేస్తావేంట్రా నీ ఖర్చులకు కొంత ఉంచుకో'' ఆప్యాయంగా బిడ్డ తల నిమురుతూ అన్నాడు సీతారామయ్య.

''వద్దు నాన్నా నాకిప్పుడేం వద్దు. కావాలంటే మిమ్మల్ని అడుగుతానులెండి'' అంటూ తలిదండ్రుల పాదాల్ని స్పృశించాడు.

కొడుకు వినయ విధేయతల్ని చూసి మురిసిపోయారు సీతారామయ్య దంపతులు.

భానుప్రకాష్ జీవితంలో స్థిరపడటంతో వాడికి నచ్చిన అమ్మాయితో పెళ్ళి జరిపించారు.

జానకి మంచి తనాన్ని చూసి కొడుక్కి తగ్గ కోడలే అనుకుని ఆమెను కన్న కూతురుకంటె మిన్నగా అభిమానించారు.

సంవత్సరం ఇట్టే తిరిగిపోయింది.

భానుప్రకాష్‌కి వంశోద్ధారకుడు కలిగాడు. ఇక ఆ కుటుంబ సభ్యుల ఆనందం చెప్పనలవి కాదు.

నెలనెలా కొడుకు పట్టుకొచ్చిన డబ్బుతో ఇంటికి అవసరమైన వస్తువులన్నిటిని సమకూర్చాడు సీతారామయ్య.

రానురాను కోడలి ప్రవర్తనలో మార్పు రావడం గమనించారు సీతారామయ్య దంపతులు.

మొన్నటివరకు అందరితో కలివిడిగా సంచరించే జానకి ఈ మధ్య ఎందుకో అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తోంది. అయితే ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు సీతారామయ్య దంపతులు.

ఆ రోజు ఫస్టు.

పట్టుకొచ్చిన జీతం తండ్రికిచ్చి భార్య వద్దకొచ్చాడు భానుప్రకాష్.

''మళ్ళీ నెల నుండి జీతం నాకే ఇవ్వాలి'' పెనిమిటికి కాఫీ ఇస్తూ ఆంక్ష విధించింది జానకి.

''అదేంటి ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావ్?! ఎప్పుడూ జీతం నాన్నకే కదా ఇస్తున్నాను'' భార్య మాటలకు విస్తుపోతూ అన్నాడు భానుప్రకాష్.


''ఇస్తున్నారెండి.. తెచ్చిన డబ్బంతా వాళ్ళు ఏం చేస్తున్నారో తెలీడం లేదు. మొన్న మా ఫ్రెండ్ రేవతి పెళ్ళికి వెళదామనుకుని బీరువా తెరిచి చూస్తే ఒక్క మంచి చీరైనా లేదు. వాయిల్ చీర కట్టుకుని వెళ్ళలేక నోరు విడిచి అత్తయ్యను ఓ కంచి పుట్ట చీర కొనమన్నాను. అందుకు ఆవిడ మొహం అదోలాపెట్టింది నేనేదో వాళ్ళ సొమ్మంతా దోచుకుతినేస్తున్నట్లు. మన డబ్బు మనం ఖర్చుపెట్టుకోడానికి కూడ స్వేచ్ఛ లేనప్పుడు దేనికండి మీ సంపాదన?'' నిష్ఠూరంగా పలికింది జానకి.

''ఈ మాత్రానికి అంత కోపమెందుకు డియర్ నీకు కావలసింది పట్టు చీరే కదా నాన్న నడిగి నేను కొనిపెడతాన్లే' అర్ధాంగిని దగ్గరకు లాక్కుని బుజ్జగించాడు భానుప్రకాష్.

మరి మాట్లాడలేదు జానకి.

అక్కడితో ఆ టాపిక్కి తెరపడినందుకు ఊపిరి పీల్చుకున్నాడు.

మొగుడితో వాదించడమిష్టం లేక ఊరుకుందే గాని లోలోన జానకి మనసు రగిలి పోతోంది. ప్రతి చిన్న విషయానికి అత్తమామల్ని దేబురించడం ఆమెకేమాత్రం రుచించడం లేదు. అందుకే ఓ రోజు భర్తతో వేరు కాపురం పెట్టమని నిర్మొహమాటంగా



చెప్పింది.

భార్య పేల్చిన బాంబుకు అదిరిపడ్డాడు భానుప్రకాష్. ఇది తనకు పుట్టినబుద్ధో లేక ఎవరైనా మప్పుతున్నారో తెలీడం లేదతడికి.

''ఒకే ఊళ్ళో ఉండి తండ్రి కొడుకులు ఎడంగా ఉంటున్నారంటే ఏం బావుంటుంది చెప్పు. లోకం దృష్టిలో మనం చులకనైపోమూ! నా మాట విని అటువంటి ఆలోచనేది పెట్టుకోకు'' అర్థింపుగా అన్నాడు.

''మీరెన్ని చెప్పండి నేనిక్కడ ఇమడలేక పోతున్నాను'' అన్నది జానకి.

''నువ్వు మరీ అంత పట్టుబడితే నేనేం చేయగలను? నీ ముచ్చట తీరాలంటే నాకు ఇక్కడ నుంచి బదిలీ అవ్వాలి. ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నిస్తాను అంత వరకు మాట్లాడకు. అమ్మా నాన్నా విన్నారంటే బాధపడతారు.''

భర్త మాటకు మరి బదులివ్వలేదు జానకి.

కోరుకున్నట్లే భానుప్రకాష్‌కి కోట ఉరట్ల బదిలీ అయింది.

కన్నకొడుకు దూరంగా వెళ్ళిపోతున్నాడని తెలిసి బాధపడ్డారు సీతారామయ్య దంపతులు.

సర్వం ధారపోసి తననింతవాణ్ణి చేసిన తండ్రిని, అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన తల్లిని విడిచి వెళ్ళాలంటే శరీరం నుంచి ప్రాణాన్ని వేరు చేస్తున్నంత బాధ కలిగింది. అయినా ఏం చెయ్యలేని పరిస్థితి.

ఉరట్ల వెళ్ళిపోయినా అప్పుడప్పుడు కన్నవాళ్ళ వద్దకొచ్చి వాళ్ళ యోగక్షేమాలు కనుక్కునేవాడు.

ఎవరి సమస్యలతో నాకు సంబంధం లేదన్నట్లు కాలం దాని పని అది చేసుకుపోతోంది.

ఒక రోజు సీతారామయ్య కడుపునొప్పితో విలవిలలాడి పోయాడు.

భర్త పడుతున్న బాధని చూస్తుంటే మహలక్ష్మమ్మకు కాళ్ళు చేతులు ఆడలేదు. దగ్గరుండి వైద్యుణ్ణి పిలుచుకొచ్చింది.

''ఇతనికి అపెండిసైటిస్ లక్షణాలున్నాయి వీలు చేసుకుని హాస్పటల్‌లో చేర్పించండి. శస్త్ర చికిత్స చెయ్యవలసి ఉంటుంది'' అన్నాడు డాక్టరు. తాత్కాలిక ఉపశమనానికి ఇంజక్షన్ చేసి మందులు రాసిస్తూ.

ఏం చెయ్యాలో తోచక కొడుక్కి టెలిగ్రాం పంపింది.

భానుప్రకాష్ వచ్చాడు.

డబ్బు పట్టుకొచ్చి తండ్రి ఆపరేషన్‌కి ఏర్పాటు చేస్తానని చెప్పి వెళ్ళిన మనిషి ఎంతకి రాకపోయేసరికి ఇక వాడు రాడన్న నిర్ణయానికొచ్చేసింది మహలక్ష్మమ్మ.

సీతారామయ్య పరిస్థితి రోజురోజుకి క్షీణిస్తోంది. తన వద్దనున్న నాలుగు డబ్బులు మందులకే సరిపోయింది. ఇక ఏం చెయ్యాలో తోచక ఆ భగవంతుడి మీద భారం వేసి చతికిలబడిపోయింది. ఏ దేవుడు ఆమె మొర ఆలకించలేదు.

ఊహించినట్టే కన్ను మూసాడు సీతారామయ్య.

లబో దిబో మంది మహలక్ష్మమ్మ.

***

గతం నుండి బయటపడ్డ జానకి భయంతో గజగజ వణికి పోయింది. ఆ రోజు తండ్రి ఆపరేషన్ కోసం భర్త డబ్బు పట్టుకెళ్ళబోతే తనే అడ్డుకుంది. ఆ రోజు పట్టుచీర కొనలేదన్న ఒకే ఒక కారణంగా అత్తమామల మీద ద్వేషాన్ని పెంచుకున్న తను బాంధవ్యాల్ని సహితం పక్కన పెట్టి మరీ అంత కఠినంగా ఎలా ఉండగలిగానా అని ఆమెకు ఇప్పుడనిపిస్తోంది. తన మూలంగానే సీతారామయ్య చనిపోయాడు. భర్త వియోగాన్ని భరించలేక ఆ మహాసాధ్వి కూడ అతడినే అనుసరించింది. తను చేసుకున్న పాపానికి నిష్కృతి లేదు. అందుకేనేమో అత్తయ్య పరిస్థితి తన జీవితంలోను పునరావృతమైంది. దైవలీల ఎంత చిత్రమైంది? మనం చేసుకున్నదే మనతో వస్తుందంటారు. ఇదేనేమో!

తన ఊహకు భిన్నంగా మాధవి వచ్చింది.

ఆమెను చూసిన జానకి నోట మాట రావడం లేదు.

''ఆఫీసులో ఆడిట్ అవుతోందత్తయ్యా అందుకే తను రాలేకపోయారు. ముందీడబ్బు పట్టుకెళ్ళి ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయించమని చెప్పి నన్ను పంపించారు'' హ్యాండ్ బ్యాగులో నుంచి నోట్ల కట్టలు తీసి జానకి చేతిలో పెట్టింది మాధవి.

కోడలి సహృదయతకు లోలోపలే జోహార్లర్పించుకుంది జానకి. తనలాగే మాధవి కూడ ప్రవర్తించి ఉంటే మహలక్ష్మమ్మకు పట్టిన గతే ఈనాడు తనకు పట్టి ఉండేది. ఆ పిల్ల వ్యక్తిత్వం ముందు తన వ్యక్తిత్వం ఎంత అల్పమైందో అర్థమైంది.

''అమ్మా మాధవీ, నువ్వు మనిషివి కాదు. దేవతవి. నిన్ను చూస్తుంటే చేతులెత్తి దణ్ణం పెట్టాలని వుంది. నీ అత్తయ్యనని చెప్పుకునే అర్హత నాకు లేదమ్మా'' అంటూ కోడలిని అక్కున జేర్చుకుంది జానకి.

ఆవిడ మాటలు అర్థంగాక అయోమయంగా చూసింది మాధవి.

★

రచయిత ఫోన్ నెం: 08922-238043